శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి- ఐరాల: శ్రీస్వామివారి దేవస్థానం ఆస్థాన మండపంలో బుధవారం వసంత పంచమి (శ్రీ పంచమి) సందర్భంగా వైభవంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించడం జరిగిందని దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశులు తెలిపారు. ఈ అక్షరాభ్యాసాలకు ఆస్థాన మండపానికి ప్రధాన దేవాలయం నుండి సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామివారిని, సరస్వతిదేవి అమ్మవారిని తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. 635 మంది చిన్నారులకు చైర్మన్, ఈవో అక్షరాలను దిద్దించారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేలా..

జిల్లా స్థాయి సైన్సు నమూనాల ప్రదర్శన

జిల్లా స్థాయి సైన్సు నమూనాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ షన్మోహన్, జిల్లా స్థాయిలో సైన్సు నమూనాలను తిలకిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్యార్థుల్ని విజ్ఞానశాస్త్రపరంగా వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేలా జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్షా అభియాన్ సంయుక్తంగా సైన్సు నమూనా ప్రదర్శన చేపట్టింది. బుధవారం నుండీ ఈనెల 16వ తేది వరకు జిల్లాస్థాయి సైన్సు నమూనాల ప్రదర్శన (జిల్లాస్థాయి ఇన్స్పైర్ మనాక్ అవార్డు ప్రాజెక్ట్ కాంపిటీషన్) స్థానిక పిఈఎస్ పాఠశాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ షన్మోహన్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో విజ్ఞానశాస్త్ర పరంగా వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం చాలా అవసరమన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు రేకెతించి శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఇందు కోసం ప్రతిఏటా ప్రభుత్వం విద్యార్థులచే ప్రయోగాల నమూనాల ప్రదర్శన ఏర్పాటు చేసి మండల, జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయిలో ఉత్తమ నమూనాలకు ప్రొత్సహాలను అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తోంది.

విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, వాటి సాఫల్యతకు ఊతమిచ్చే ఉద్దేశంతో భారత ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డిఎస్‌టి) ఆధ్వర్యంలో ఇన్స్పైర్ మనక్ అనే పథకాన్ని ప్రతి ఏటా కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. పాఠశాల స్థాయిలో జిల్లాస్థాయి కార్యక్రమం ఈనెల 14 నుండి 16వ తేదీ వరకు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 10 నుండి 15 సంవత్సరాల వయసు గల అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో సజనాత్మకత, వినూత్న ఆలోచనలను పెంపొందించడం, విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించడం, శాస్త్రీయ ప్రతిభను వెలికి తీసి విద్యార్థుల్ని పరిశోధనల వైపు ఆకర్షితుల్ని చేయడం, భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన వారిని జిల్లా స్థాయికి, జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరచిన వారిని రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో ఎంపిక కాబడిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సజనాత్మక ఆలోచనలకు కార్యరూపం దాలుస్తూ వైజ్ఞానిక ప్రదర్శనలలో ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.

జిల్లా స్థాయిలో 417 నమూనాలు

జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సైన్సు నమూనాల ప్రదర్శనకు 417మంది గ్రేడ్ టీచర్లతో పాటు సమన్వయ కోసం 20మందితో టీమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి నమూనాల్లో ఉత్తమ నమూనాలను ఎంపిక చేసేందుకు 40 మంది ఉపాధ్యాయులను జడ్జిలుగా నియమించి ఎంపిక చేస్తున్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన నమూనాలను రాష్ట్ర స్థాయిలోనిర్వహించే పోటీల్లో ప్రదర్శిస్తారు. జిల్లా స్థాయి సైన్సు నమూనాల ప్రదర్శనలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు మూడు రోజులు పాటు తాము తయారు చేసిన నమూనాలను ప్రదర్శించనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలు జిల్లాలో..

- రమణ, జిల్లా సైన్సు అధికారి

రాష్ట్రస్థాయి ఇన్‌స్పెర్ నమూల ప్రదర్శన చిత్తూరు జిల్లాలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు జిల్లా సైన్సు అధికారి రమణ తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాని కోరడం జరిగింది. ప్రభుత్వ నిబంధనల మేరకు మౌళిక వసతులు ఉన్న విద్యాసంస్థలో రాష్ట్రస్థాయి సైన్సు నమూనాల ప్రదర్శన ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రభుత్వ అనుమతిస్తే జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్షా అభియాన్ సమన్వయంతో విజయవంతం చేస్తాం.

జిల్లా స్థాయి ఇన్స్పైర్ మనాక్ అవార్డు ప్రాజెక్ట్ కాంపిటీషన్

- దేవరాజు, జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న సైన్సు నమూనాల ప్రదర్శనకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుండీ 417 నమూనాలను ప్రదర్శించడం జరుగుతోంది. బెంగుళూరు– పలమనేరు బైపాస్ రోడ్డులోని పిఈఎస్ పబ్లిక్ స్కూల్‌లో మూడురోజుల పాటు సైన్సు నమూనాల ప్రదర్శన ఉంటుంది. విద్యార్థులు అత్యంత ఉత్సహంగా పాల్గొంటున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదం చేస్తాయి.

16న బంద్‌ను జయప్రదం చేయండి

స్కూటర్ ర్యాలీని ప్రారంభిస్తున్న కార్మిక, కర్షక సంఘాల నాయకులు

కార్మిక, కర్షక సంఘాల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరిని వ్యతిరేకించండి.. 16వ తేదీ జరుగుతున్న ఆల్ ఇండియా బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు, ఏఐటియుసి నాయకులు స్కూటర్ ర్యాలీలో పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమై శాషాపిరణ్ వీధి, బజార్ వీధి, మార్కెట్, చర్చి వీధిలో స్కూటర్ ర్యాలీ చేస్తూ 16వ తేదీన జరుగుతున్న ఆల్ ఇండియా బంద్‌ను జయప్రదం చేయాలని నినాదాలు చేశారు. ఈ బంద్‌కు వ్యాపారస్తులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ స్కూటర్ ర్యాలీ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంజీవరం సురేంద్రన్, జిల్లా అధ్యక్షులు పి.చైతన్యలు, ఏఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజన్ మాట్లాడుతూ దేశంలో ఉన్న బడాబడా పెట్టుబడిదారులకు బహుళజాతి కంపెనీలకు నరేంద్ర మోడీ వత్తాసు పలకడం, కార్మికులకు రైతులకు ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు వ్యతిరేకమైన చట్టాలు తీసుకుని రావడం హేయమని అన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వాటిని నివారించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అందుకోసం స్వామినాథన్ సిఫార్సులు ప్రకారం రైతులకు మద్దతు ధరలు ఇన్పుట్ సబ్సిడీలు ఇవ్వాలని తెలిపారు. కార్మికులకు ఎంతో ఉపయోగపడిన చట్టాలను తగ్గించి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొని రావడం దారుణమన్నారు. జీఎస్టీ పన్నులను తగ్గించాలని, చిన్న తప్పులకు పెద్ద శిక్షలు వేసే విధంగా ట్రాన్స్పోర్ట్ చట్టాన్ని తీసుకుని రావడం నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. దేశంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, పారిశ్రామిక కార్మికులు, ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు ఉపాధి హామీ పథకం కార్మికులు వ్యాపారస్తులు అన్ని వర్గాల ప్రజలు నరేంద్ర మోడీ పరిపాలనలో అష్ట కష్టాలు పడుతున్నారని, బిజెపి ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్‌ను పారిశ్రామిక బంద్, ట్రాన్స్పోర్ట్ బందును జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. చిత్తూరు నగరంలో కూడా వ్యాపారస్తులు, విద్యాసంస్థలు, ఆటో కార్మికులు, సినిమా థియేటర్లు, బియ్యం వ్యాపారస్తులు, వస్త్రదుకాణదారులు అందరూ ఈ16వ తారీఖు జరుగుతున్న బంద్‌ను జయప్రదం చేయుటకు సహకరిస్తారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి బుద్ధి వచ్చేలా విధంగా గట్టిగా బంద్ చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, ఆరోగ్య దాసు, ఏఐటియుసి నగర అధ్యక్షులు దాసరి చంద్ర, జయశంకర్, రఘు, సురేష్, మంజుల, బిల్డింగ్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతిరావు, హమాలీ నాయకులు పలని తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా సౌకర్యాలు

ఏఈఆర్వో, కమిషనర్

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పరిశీలిస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేర పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పక్కాగా ఉండాలని ఏఈఆర్వో, నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కమిషనర్ నగర పాలక సంస్థ పరిధిలోని 1, 2, 3, 4, 50, 40 వార్డు పరిధిలో 11, 7, 8, 12, 13, 18, 19, 20, 24, 9, 10, 27 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో ఇటీవల చేపట్టిన పనులను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుదీకరణ పనులను తనిఖీ చేసి లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా అని పరిశీలించారు. నీటి సరఫరా, మరుగుదొడ్లకు నీటి సౌకర్యం, ఫర్నిచర్, ర్యాంపుల నిర్మాణాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల ఆవరణాల్లో ఇతరత్రా మెటీరియల్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు రజని, లోకేష్, రవీంద్ర, బీఎల్వోలు, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయండి

నగర కమిషనర్ అరుణ

టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కమిషనర్ టిడ్కో గృహ సముదాయాల్లోని ఇళ్లను పరిశీలించారు. గృహాల్లో పూర్తయిన పనులను తనిఖీ చేసి, నీటి సరఫరా, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. జరుగుతున్న పనులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ ఉన్న వాటర్ పైపులైన్ల, విద్యుదీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గృహ సముదాయం ఆవరణాన్ని శుభ్రం చేయించాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. పనులన్నిటినీ వారం రోజుల్లో పూర్తి చేయించాలని టిడ్కో ఈఈ వెంకటముని, గుత్తేదారులకు సూచించారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్, టిడ్కో కన్సల్టెంట్ ధనుంజయ రెడ్డి, గుత్తేదారులు పాల్గొన్నారు.

కార్మికులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర పాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆప్కాస్‌లోని కార్మికులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డు కోసం ప్రత్యేక ఆధార్ సీడింగ్ క్యాంపు నిర్వహించినట్లు కమిషనర్ జె.అరుణ చెప్పారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో ఈఎస్ఐ అధికారులతో కలిసి ఆధార్ సీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఆప్కాస్ పరిధిలోని కార్మికులు వారి ఆధార్ నెంబర్లను ఈఎస్ఐ కార్డులతో అనుసంధానం చేసుకోవడం ద్వారా ఆయుష్మాన్ భారత్ హెల్త్‌అకౌంట్‌ను పొందవచ్చన్నారు. ఈ అకౌంట్ ద్వారా దేశవ్యాప్తంగా ఈఎస్ఐ సేవలను పొందే అవకాశం లభిస్తుందని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలోని సుమారు 500మంది కార్మికుల కోసం మూడు రోజులపాటు ఆధార్ సీడింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈఅవకాశాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ షేక్ సెహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు : జేసి

రాజీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల సిబ్బంది తమ విధులను నిర్వర్తించాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో జేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 22న ఫైనల్ ఎలక్టోరల్ రోల్ పబ్లిష్ చేయడం జరిగిందని, ఓటర్ల జాబితాలో సవరణలు మార్పులు చేర్పులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలన నిర్వహించడం జరుగుతోందని అన్నారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన మేరకు అధికారుల నియామకాలు దాదాపుగా పూర్తి అయ్యాయన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి 1,500 మందికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉన్నాయని, దీనికి అనుగుణంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతున్నదని తెలిపారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ప్రతినిధి భాస్కర్, పరదేశి, సిపిఎం ప్రతినిధి గంగరాజు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి భాస్కర్, వైయస్సార్సీపి ప్రతినిధి ఉదయ్ కుమార్, టిడిపి ప్రతినిధి ప్రభు తేజ, ఎలెక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

ఉద్యోగంతో పాటు సంక్షేమం ముఖ్యం : ఎస్పీ

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జాఘువా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలీస్ ఉద్యోగంతో పాటు వారి సంక్షేమం కూడా ముఖ్యమేనని ఏఆర్ బలగం జిల్లా బలగానికి వెన్నెముక లాంటిదని జిల్లా ఎస్పీ జాషువ అన్నారు. జిల్లా నూతన ఎస్పీగా భాద్యతలు స్వీకరించిన అనంతరం ఒక్కోశాఖ వారితో సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ బుధవారం జిల్లాలోని సాయుధ పోలీసు అధికారులతో పట్టణంలోని పోలీస్ గెస్ట్‌హౌస్‌లో గల కాన్ఫరెన్స్ హాల్‌లో పరిచయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొదటగా సిబ్బంది బాగోగులు, ఉద్యోగ నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఏఆర్, హొం గార్డ్ సిబ్బందితో దర్బారు పెరేడ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అధికారులు ప్రస్తావించిన సమస్యలు, సంక్షేమం పరంగా సూచించిన అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ రానున్న రోజులలో జరగబోయే ఎన్నికలు సజావుగా జరగడానికి సాయుధ బలగాల కృషి ఎంతో అవసరమని బ్యాలట్ బాక్స్‌లు వచ్చిన రోజు నుండి కౌంటింగ్ అయ్యేవరకు ముఖ్యపాత్ర పోషించేది మీరేనని, బ్యాలట్ బాక్స్‌లకు ఎస్కార్ట్, స్ట్రాంగ్ రూమ్‌ల గార్డ్ డ్యూటీలు ఇలా ముఖ్యతరమైన ఉద్యోగాలు నిర్వహించాలని ఎస్పీ తెలియజేశారు. అలాగే ముఖ్యంగా ఏఆర్ పోలీసు సిబ్బంది క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాలని ఎలాంటి చెడు నడవడికకు ఆస్కారం ఇవ్వకుండా బానిస కాకుండా ఉద్యోగ నిర్వహణ చక్కగా నిర్వహించాలని హితవు పలికారు. అడిషనల్ ఎస్పి అడ్మిన్ అరిఫుల్ల, ఏఆర్ అడిషనల్ ఎస్పి జి.నాగేశ్వర రావు, ఏఆర్ డిఎస్పి ఇలియాస్ బాష, ఎస్‌బి ఇన్స్పెక్టర్ గంగిరెడ్డి, ఆర్ఐలు నీలకంటేశ్వర రెడ్డి, మధు, భాస్కర్ పాల్గొన్నారు.

పి.కొత్తకోట ఎస్సీ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

ప్రజాశక్తి- ఐరాల: పూతలపట్టు మండలం పి.కొత్తకోట ఎస్సీ ప్రభుత్వ బాలుర వసతి గృహఅధికారిపై పలు ఫిర్యాదులు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్‌కి అందడంతో కలెక్టర్ వారి ఆదేశాలు మేరకు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి రాజ్యలక్ష్మి పి.కొత్తకోట ఎస్సీ ప్రభుత్వ బాలుర వసతి గృహంను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎస్సీ ప్రభుత్వ బాలుర వసతి గృహం విద్యార్థులను విచారించగా వాళ్ళకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, వసతి గృహ అధికారి జి.సురేష్, సరిగా విధులకు హాజరు కావడం లేదని, మరుగుదొడ్లు కూడా సరిగా లేవని, అక్కడ కాపలాదారుడిగా పనిచేస్తున్న వారు, వసతి గృహ అధికారి విధులకు సరిగా హాజరు కావడం లేదని తెలిపారు. ఈ లోటుపాట్లు పరిగణనలోకి తీసుకొని జిల్లా కలెక్టర్ వసతి గృహ అధికారి జి. సురేష్‌ను విధులను నుంచి సస్పెండ్ చేశారు.

ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలి

అంగన్వాడీలతో మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- పుంగనూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ని బలోపేతం చేయడానికి నిధులు పెంచాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం పుంగనూరు ప్రాజెక్టు అంగన్వాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కి బడ్జెట్లో నిధులు తగ్గించడం దారుణమని విమర్శించారు. శిశు మరణాల రేటు తప్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాల్సింది పోయి నిర్వీర్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. నిరుపేద పిల్లలు, గర్భిణీలకు, బాలింతలకు నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీలను సమస్యను పరిష్కారం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు లేకుండా చేయడం బాధాకరమన్నారు. రోజురోజుకీ నిత్యావసర వస్తు ధరలు ఆకాశాన్ని అంటున్నాయని, వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలు పరిష్కారం కోసం 16న జరిగే భారత్ బంద్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలుగా పద్మ, అధ్యక్షురాలు కల్పన, కార్యదర్శిగా లీలావతి, కోశాధికారిగా చంద్రావతి, 15 మందిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు.

'20న జాబ్‌మేళా' పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఈనెల 20న ఆర్‌విఎస్ నగర్‌లోని శ్రీవేంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీఆర్ నందు జరగనున్న ప్రాంతీయ జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను బుధవారం జిల్లా సచివాలయంలో రాజంపేట ఎంపి, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎంఎల్‌సి భరత్ ఆవిష్కరించారు. ఈ ప్రాంతీయ జాబ్ మేళాలో దాదాపు 100కు పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, 10వ తరగతి నుండి పీజీ ఫెయిల్/పాస్ అయిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీలు, పురుష అభ్యర్థులు హాజరుకావచ్చునని, ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రీజనల్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్యాంమోహన్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి: యుటిఎఫ్

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏపి జేఏసి పిలుపు మేరకు బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు నేతృత్వంలో కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైయ్యారు. ఈసందర్భంగా సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు 21వేల కోట్లు ఆర్థిక బకాయిలు పెట్టిందన్నారు. న్యాయపరంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంజీవయ్య సేవలు మరువలేనివి: జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రం రెండవ ముఖ్యమంత్రి కీర్తిశేషులు దామోదరం సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేవని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య 103 జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిచారు. కార్యక్రమంలో డ్వామా పిడి యన్.రాజశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి డాక్టర్ రాజ్యలక్ష్మి, జడ్పీ సిఈఓ ప్రభాకర్ రెడ్డి, బిసి సంక్షేమశాఖ డీడీ రబ్బానీ బాషా, బిసి కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ లక్ష్మి ప్రసన్నలతో కలసి పాల్గొన్నారు.

సంజీవయ్య చిత్రపటానికి నివాళ్ళు అర్పిస్తున్న జేసి శ్రీనివాసులు

చెరకు తీపెక్కి.. ఆశలు చిగురించి

- మళ్లీ చెరకు సాగుపై రైతన్న సిద్ధం
- ఆశాజనకంగా ధరలు
- బెల్లం తయారీలో బిజీబిజీ
- వెంటాడుతున్న కూలీల కొరత

ప్రజాశక్తి-వెదురుకుప్పం: చిత్తూరు జిల్లాలో అధిక సంఖ్యలో రైతులు చెరుకు సాగుపై అసక్తి చూపేవారు. విస్తారంగా సాగు చేసి ఫ్యాక్టరీలకు తరలించేవారు. మరికొందరు బెల్లం తయారీ చేసి అమ్ముకునేవారు. కాగా షుగర్ ఫ్యాక్టరీలు మూత పడగానే సాగు విస్తీర్ణం తగ్గింది. అశించిన మేరా ధరలు లేకపోవడంతో పెద్ద సంఖ్యలో రైతులు చెరుకు సాగుకు దూరమైయ్యారు. అక్కడక్కడా బెల్లం తయారీకి కొంత మేరా సాగు చేసేవారు. ప్రభుత్వం నల్లబెల్లంపై ఆంక్షలు విధించడంతో చెరకు సాగుపై ఆసక్తి చూపలేదు. వెదురుకుప్పం మండలంలో గరిష్టంగా 425.9 హెక్టార్లలో రైతులు చెరుకు సాగు చేశారు.

బెల్లం ధరలకు రెక్కలు..

గతేడాధి బండి(750కేజీలు) బెల్లం ధర రూ.12వేల నుంచి రూ.15వరకూ ఉండేది. ఈ ఏడాధి వచ్చేసరికి మార్కెట్‌లో రెండింతలుగా పెరిగి ప్రస్తుతం బండి(750కేజీలు) ధర గరిష్టంగా రూ.30వేల వరకూ పలుకుతోంది. దీంతో పూర్తిగా ఆశలు వదులుకున్న రైతన్నలు మళ్లీ చెరకు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే చెరుకుతోటలు ఉన్న రైతులు బెల్లం తయారీకి గానుగలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంకొందరు ఇప్పటికే బెల్లం తయారీలో నిమఘ్నమైయ్యారు.

బెల్లం తయారీలో జీబిజీగా రైతులు



వెంటాడుతున్న కూలీల కొరత..

సాధారణంగా చెరకు సాగు అంటేనే అధికంగా కూలీలు అవసరం. దుక్కిదున్నింది మొదలుకొని తోటలు చుట్టకం, తీయడం, గానుగ నిర్వహణ, బెల్లం తయారీ ప్రక్రియ వరకూ కూలీల ద్వారానే చేపట్టాల్సి ఉంటుంది. అధిక కూలీ రేట్లు పైగా కూలీల కొరతతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదనే తెలుస్తోంది.

ధరలు బాగున్నాయి..

ప్రస్తుతం బెల్లం ధరలు బాగానే ఉన్నాయి. బండి బెల్లం రూ.30వేల వరకు పలుకుతోంది. కూలీల సమస్య అధికంగా ఉంది. కుటుంబ సభ్యులందరం కలిసి గానుగ పనులు చేసుకొంటూ ఇబ్బంది పడుతున్నాం.

బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఆళ్లమడుగు గ్రామం, వెదురుకుప్పం

చెరకు రైతులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి..

చెరకు సాగు చేస్తున్న రైతులపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ధరలు పెరిగినా కూలీల కొరత, అధిక కూలీ రేట్లతో ఇబ్బంది పడుతున్నాం. ప్రత్యాన్మాయంగా తోడ్పాటు అందిం చేందుకు ప్రభుత్వాధికారులు చొరవ తీసుకోవాలి

మోహన్‌నాయుడు, ఒత్తులూరు గ్రామం, కార్వేటినగరం

ఆశించిన మేరా ఆదాయం వచ్చే అవకాశం ఉంది..

మునుపెన్నడూ లేని విధంగా బెల్లం ధరలు పెరిగాయి. చాలా సంతోషంగా ఉంది. కష్టపడి గానుగ ఆడించి బెల్లం తయారీ చేస్తే ఆదాయం చేతికందే అవకాశాలు ఉన్నాయి. కూలీల కొరతతో ఇబ్బందులు పడుతున్నాం.

ఈశ్వర్‌రెడ్డి, మాంబేడు గ్రామం, వెదురుకుప్పం

ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ

వాతావరణంలో విపరీత మార్పులు కనిపిస్తున్నాయి. ఉదయాన్నే తీవ్రమైన మంచు.. మధ్యాహ్నం భానుడి భగభగలు.. అటు చలి.. ఇటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పొద్దున 8గంటల వరకూ మంచు వీడటం లేదు.. అదే తరహాలో పగలంతా ఎండలు మండుతున్నాయి. చలి, ఉక్కపోతతో అనారోగ్య సమస్యలు కలిగే అవకాశం ఉంది. చాలా జాగ్రత్తగా ఉండాలని అధికారులు వృద్ధులు, పిల్లలకు సూచిస్తున్నారు. అదేవిధంగా వాతావరణ మార్పులు వ్యవసాయ పంటలపై కూడా ఉండే అవకాశం ఉండడంతో రైతులు అధికారుల సలహాలు తీసుకొని ప్రత్యాన్మాయ చర్యలు తీసుకోవాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజాశక్తి-బంగారుపాళ్యం

ఓపీఎస్‌కు మద్దతివ్వాలని వినతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఓపీఎస్‌కు మద్దతు తెలపాలని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌కు యూటీఎఫ్ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. యూటీఎఫ్ నాయకులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఓపిఎస్ స్థానంలో నూతనంగా సిపిఎస్, జిపిఎస్ తెచ్చారని దానివలన ప్రభుత్వ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆ విధానాన్ని రద్దు చేయాలని, వైసిపి మ్యానిఫెస్టోలో ఓపీఎస్ చేర్చాలని వినతి పత్రం సమర్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటముని నాగరాజు, అమలు, కుమారి గుణసుందరి తదితరులు పాల్గొన్నారు.

నేడు టమాటా రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-సదుం, సోమల: పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని టమాటా రైతులకు అవగాహన సదుస్సు నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారి సంతోషికుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు చౌడేపల్లి మండల పరిధిలోని పొదలపల్లి కలెక్షన్ సెంటర్ వద్దనున్న మోహన్‌రెడ్డి నర్సరీలో సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. బెంగళూరుకు చెందిన ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-సోమల: మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను చౌడేపల్లి రూరల్ సీఐ కృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. కందూరు, సోమల ప్రాంతాల్లోని కేంద్రాల్లోని సౌకర్యాలు, అక్కడి పరిస్థితులపై ఆరాదీశారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు. భద్రత పరమైన అంశాలను స్థానిక ఎస్ఐ వెంకట నరసింహులతో చర్చించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, వీఆర్‌వోలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బంది కలగకూడదు: తహశీల్దార్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని విధాల చర్యలు చేపట్టాలని తహశీల్దార్ స్వర్ణలత సెక్టార్ ఆఫీసర్లను ఆదేశించారు. బుధవారం ఆమె కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో దృష్టిలో పెట్టుకొని మండల పరిధిలోని 48పోలింగ్ కేంద్రాల్లో నెంబర్ల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా ఇదివరకు జరిగిన ఓటర్ జాబితా ప్రక్రియలో మార్పులు చేర్పులు ప్రక్రియ త్వరలో పూర్తి చేయాలని సూచించారు. నూతనంగా ఓటర్ నమోదు కార్డులు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ సాయిలీల, హౌసింగ్ ఏఈ స్వామిదాస్, ఏవో గీత తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

ప్రజాశక్తి-సోమల: ఈవీఎంలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ నాగరాజు అన్నారు. బుధవారం స్త్రీ శక్తి భవనంలో మండల మహిళ సమైక్య కార్యవర్గ సభ్యులకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటు వేసిన తర్వాత ఎవరికి ఓటు వేసాము అన్న విషయాన్ని పక్కనే ఉన్న వివి పార్ట్ మిషన్‌లో బీఫ్ శబ్దం తర్వాత డిస్ప్లే అవుతుందని దీని ద్వారా తాము ఎవరికి ఓటు వేశామన్నది ఓటరుకు కచ్చితంగా తెలుస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఓటు నమోదు చేసుకునే విధంగా మహిళలకు అవగాహన కల్పించాలని ఏపీఎం శివ అన్నారు. కార్యక్రమంలో డిటి శ్యాం ప్రసాద్ రెడ్డి, ఏవో సుధాకర్, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి : ఆర్‌వో

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని పూతలపట్టు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శివ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాల్లో వసతులు కల్పించడంతో పాటు ర్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభద్రమ్మ, ఆర్ఐ దీపక్‌రెడ్డి, వీఆర్‌వో పునీత్, హెచ్ఎం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

17న చేపల చెరువుల వేలం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేట పంచాయతీ పరిధిలోని రెండు చేపల చెరువులకు వేలం పాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సబిత ఓ ప్రకటలో తెలిపారు. 17న శనివారం మధ్యాహ్నం 2గంటలకు గ్రామ సచివాయలంలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాట దారులు దరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. సోమప్ప, శ్రీకృష్ణ జన్మకుంట చెరువులకు సంబంధించి వేలం ఉంటుందన్నారు.

వీఆర్‌ఏల రిలే దీక్షలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ ఏలు) సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 18, 19, 20వ తేదీల్లో విజయవాడ వేదికగా చేపడుతున్న రిలే దీక్షలను జయప్రదం చేయాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బయ్య పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం వీఆర్‌ఏల సంఘం నాయకులు సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ కార్యకలాపాలు సాగించడంలో గ్రామ రెవెన్యూ సహాయకులదే కీలక పాత్రనీ, అయితే వారికిచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం అన్యాయమని సుబ్బయ్య వాపోయారు. వీఆర్‌ఏల చేత గొడ్డు చాకిరీ చేయించుకుంటూ వారికి కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వమని కోరితే జగన్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మండి పడ్డారు. ప్రతిపక్ష నేతగా జగన్ పాదయాత్ర చేసినప్పుడు వీఆర్‌ఏలకిచ్చిన హామీలను సీఎం హోదాలో ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. వెంటనే వీఆర్‌ఏలకు పెండింగ్ బకాయిలను చెల్లించి, కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని కోరారు.

పేదల మనస్సుల్లో వైఎస్సార్‌ది చెరగని ముద్ర: డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: పేదల మనస్సుల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ కాంపౌండ్ గోడ ఎదుట కొత్తగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని వైస్ ఎంపీపీ హరిబాబు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ఉచిత విద్యుత్తు, జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టులు నిర్మాణం, రుణమాఫీ, అన్నివర్గాల ప్రజలకు ఆరోగ్య అత్యవసరమైన కాపాడేందుకు 108 అంబులెన్స్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ చేసిన ఏకైక సీఎం వైఎస్సార్ ఒక్కరేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, నాయకులు గుణశేఖర్ రెడ్డి, దాముశెట్టి, కమలాకర్ రెడ్డి, చిన్నమరెడ్డి, వేలు మొదలి, ఏకాంబరం, వెంకటరెడ్డి, మునిరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం

ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాలు అమలు: ఎంపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

ప్రజాశక్తి-పలమనేరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం పలమనేరు పట్టణంలో 4వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పలమనేరు, కుప్పం మున్సిపల్ ఛైర్మన్లు చాముండేశ్వరి, డాక్టర్ సుధీర్, వైస్ ఛైర్మన్లు రవి, గుల్జార్, ఆర్డీవో మనోజ్ రెడ్డి, కమిషనర్ రమణారెడ్డి, మెప్మా పిడి రాధమ్మ, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఐరాల: వైఎస్సార్ ఆసరా 4వ విడత నిధులు విడుదలో భాగంగా బుధవారం ఐరాల ఎంపీడీవో కార్యాలయం వద్ద పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో తోడ్పాటు అందిస్తోందన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ ఛైర్మన్ శైలజచరణ్ రెడ్డి, ఐరాల జడ్పిటిసి సుచిత్ర, కన్నయ్యనాయుడు, మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి: గిరి

ప్రజాశక్తి-పలమనేరు: గంగవరం మండలం కలగటూరు ఎంపిటీసీ భర్త మహేష్ నుండి రక్షణ కల్పించాలని తవణంపల్లి మండలం మల్లకుంట గ్రామానికి చెందిన గిరి కోరారు. బుధవారం పలమనేరు ప్రెస్‌క్లబ్‌లో తనకు జరిగిన అన్యాయాన్ని క్లుప్తంగా వివరించారు. బాధితుడు తెలిపిన వివరాలు మేరకు తన తల్లి, తండ్రి అయిన ఎల్లప్ప పేరు మీద కలగటూరు గ్రామంలో సర్వే నెంబర్ 443/3లో 2.50సెంట్లు భూమి ఉందని తన తాత మరణించక ముందు 2016సంవత్సరంలో వీలునామా రాయించి 2019లో చనిపోయాడని వివరించారు. వీలునామా ప్రకారం తనకు పాసుపుస్తకాలు ఆన్లైన్ చేయించాలని గంగవరం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్ళితే కలగటూరు ఎంపీటీసీ భర్త మహేష్ నకిలీ పత్రాలు సృష్టించి ఎల్లప్పకు చెందిన భూమి తనకు అమ్మేశాడని తనను బెదిరింపులకు గురి చేస్తున్నాడని వివరించాడు. ఈనెల 12వ తేదీ మహేష్ తనను గంగవరం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐతో మాట్లాడిన అనంతరం బయటకొచ్చి నాపై దాడి చేయడానికి ప్రయత్నించగా తన అన్న అడ్డుపడి కాపాడారని వాపోయాడు. అంతటితో ఆగక అతనికి అధికారం బలముందని ఇక్కడ కాదు ఊరిలోకి రా నీ అంతు చూస్తానని, భూమి వదలను, ఊరిలోని ఇంటి స్థలాన్ని వదలునని బెదిరించాడన్నారు. మహేష్ వల్ల తనకు ప్రాణహాని ఉందని, పోలీస్ అధికారులు తనకు రక్షణ కల్పిస్తూ, రెవిన్యూ అధికారులు వీలునామా ప్రకారం పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- వికోట: రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని కృష్ణాపురం సచివాలయం, ఆర్బికే కేంద్రాలను బుధవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అవసరమైన నిధులు సమకూర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన ప్రజలకు వాటిని అందించాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు సక్రమంగా అందించాలన్నారు. నిర్మాణంలో ఉన్న జగనన్న గృహాలను వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి జేఏసి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లాలోని 675 తాలూకా కేంద్రాల్లో తహశీల్దార్లకు వినతిపత్రాలు అందించడంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారని బుధవారం ఏపి జేఏసి జిల్లా అధ్యక్షులు కెవి.రాఘవులు తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులు దీర్ఘకాలిక సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు పరిష్కరించకుంటే జేఏసి రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని ప్రభుతాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

- రహదారి భద్రత అందరి బాధ్యత
- డియల్ఎస్ఏ డాక్టర్ ఐ.కరుణకుమార్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రతి ఒక్కరూ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైవింగ్ చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉప రవాణా శాఖ కార్యాలయంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ యం.గంగ నిరంజన్‌రెడ్డి, ఆర్‌టిఓ సునీల్‌కుమార్, మోటార్ వాహనాల ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావులతో కలసి 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అందులో భాగంగా యువతకు, వివిధ డ్రైవింగ్ స్కూల్స్ యాజమాన్యం వారికి మోటార్ వాహన చట్టం, రహదారి భద్రతపై నిర్వహించిన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజ్యాంగం మనకు చాలా రకాల హక్కులను కల్పించడం జరిగిందని తెలిపారు. డ్రైవింగ్ చేసే ప్రతి వ్యక్తి తన కుటుంబ సభ్యులను గుర్తు పెట్టుకొని డ్రైవింగ్ చేయాలని, వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పని సరిగా పెట్టుకోని డ్రైవింగ్ చేయడం వల్ల క్షేమంగా ఉంటారన్నారు. అమ్మ జన్మనిస్తే- హెల్మెట్ పునర్జన్మనిస్తుదాన్నారు. మద్యం సేవించి వాహనం నడపడంతో ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని, మన జీవుతాన్ని కాపాడుకుంటూ ఎదుటి వ్యక్తిలా ప్రాణాలను కాపడవలసిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలు వాహనాలను నడపరాదని, డ్రైవింగ్ చేసేటపుడు రోడ్డు నియమ నిబందలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్, పొల్యూషన్, రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేయించాలన్నారు. ఇన్సూరెన్స్ చేయించడం వల్ల అనుకోని సంఘటనలు ప్రమాదాలు జరిగినపుడు ఆ వ్యక్తి ఆ కుటుంబాన్ని కొంత ఆర్థిక సహాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎల్ఆర్ పొందిన వారికి పత్రాలను జడ్జి చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉప రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది, వివిధ డ్రైవింగ్ స్కూల్స్ యాజమాన్యం, పాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిది సోముశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

చారిత్రక బుగ్గ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం

టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: బుగ్గ అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరాలయం చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆలయమని పవిత్రమైన ఈ ప్రాంతంలో పెళ్లిల్లు చేసుకునే అవకాశం స్థానిక ప్రజలకు కల్పించాలన్న సంకల్పమే నేడు టీటీడీ కళ్యాణ మండపం ఈ ప్రాంతంలో రావడానికి కారణమైందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం ఆలయ ఆవరణలో రూ.2 కోట్ల నిధులతో నిర్మించే టీటీడీ కళ్యాణ మండపానికి టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డితో కలిసి ఆమె భూమిపూజ చేశారు. చారిత్రక బుగ్గ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. టీటీడీ కళ్యాణమండం భూమిపూజకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేడు మహత్తర కార్యక్రమానికి హాజరుకావడం ఆనందదాయకమన్నారు. అతి తక్కువ ఖర్చుతో స్థానిక ప్రజలు వివాహం జరిపించుకునే అవకాశాన్ని కల్పించాలన్న మంత్రి రోజా భగీరథ ప్రయత్నం నేడు ఫలించిందన్నారు. ఉన్నది ఉన్నట్లు నిజాయితీగా మాట్లాడే వ్యక్తి మంత్రి రోజా అన్నారు. ఆమె ఈ ప్రాంతంలో టీటీడీ కళ్యాణ మండపం కట్టాలని కోరడం దాన్ని వెంటనే ఆమోదించడం జరిగిందన్నారు. ఆమె అడిగిన మరిన్ని అభివృద్ధి పనులు కూడా ఆమె నుంచి ప్రతిపాదనలు రాగానే వందశాతం నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. పురాతణమైన ఆలయాలవిషయంలో టీటీడీ నిధులు కేటాయించడంలో స్పష్టంగా ఉందన్నారు. తప్పక అభివృద్ధిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో నాగరత్నమ్మ, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

మీడియాను ఆశ్రయించిన రైతు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తనకు న్యాయం చేయాలని చిత్తూరు రూరల్ మండలం పెరుమాళ్ళు కండ్రిగకు చెందిన రైతు శ్రీనివాసులు బుధవారం మీడియాను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పొలంలో వ్యవసాయం చేసేందుకు పైపులైన్ ఏర్పాటు చేసుకుంటే సమీప పొలం రైతు ఈశ్వర్ నాయుడు దౌర్జన్యం చేస్తూ పైపు లోను తవ్వి నాశనం చేశాడని, ఈ విషయం రెవెన్యూ, జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుపోయినా తనకు న్యాయం జరగలేదన్నారు. తనపై దౌర్జన్యం చేయడంతో పాటు అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికార్లు కల్పించుకొని న్యాయం చేయాలని వేడుకున్నాడు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు శ్రీనివాసులు నాయుడు

భారీగా అక్రమ మద్యం స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు చిత్తూరు ఈస్ట్ సీఐ కుళాయప్ప తెలిపారు. బుధవారం ఆయన వివరాలు వెల్లడిస్తూ.. రాబడిన ముందస్తు సమాచారంతో చిత్తూరు మండలం కన్నికాపురం గ్రామ సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా వస్తున్న మహింద్రా కారును అదుపుచేసి తనిఖీ చేశామన్నారు. అందులో 28కేసుల కర్నాటక మద్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు వ్యక్తులు ముద్దుకృష్ణ, జానకీలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో తాలుకా ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, క్రైం బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు